క్లుప్తంగా

నేడు కార్యకర్తలతో దద్దాల సమావేశం

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం అందుబాటులో ఉంటారు. ఉదయం 11 గంటలకు పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశమవుతారని పార్టీ కార్యాలయ ప్రతినిధి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకృతి పరిరక్షణతో మానవ మనుగడ

కనిగిరి రూరల్: ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని గుడ్ హెల్ప్ సంస్థ చైర్మన్ మంద్రు ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక సెయింట్ జోసఫ్ పాఠశాలలోని వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంద్రు ప్రవీణ్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణతో కలిగే ఉపయోగాలు, ఆరోగ్య లాభాలు, పర్యావరణం తదితర అంశాలను గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలని సూచించారు.

గోశాల ప్రారంభం



మిట్టపాలెంలో గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, కవిత దంపతులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో దాతల సాయంతో ఇటీవల నూతనంగా గోశాల నిర్మించారు. నారాయణ స్వామి ఆరాధనోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నూతన గోశాలను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, డాక్టర్ కవిత దంపతులు ప్రారంభించి అనంతరం గోపూజ చేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, బయసాని మధుసూదన్, సర్పంచ్ షేక్.ఖాదర్‌బీబుజ్జి, గోను చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్లు సీఎస్‌పురం బోయళ్ల నారాయణరెడ్డి, పామూరు బైరెడ్డి జయరామిరెడ్డి, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, చావా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టేకు, చందనం చెట్ల తొలగింపు



పాస్‌తో తొలగించిన టేకుచెట్లు

పామూరు: బత్తాయి తోటలోని టేకు, వేప చెట్లు, ఎర్రచందనం మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు పాతో తొలగించిన ఘటన మండలంలోని నిమ్మచెట్లపల్లెలో చోటుచేసుకుంది. తోట యజమాని రాగిపిండి వెంకటేశ్వర్లు, తిరుపతయ్య సమాచారం మేరకు తమ బత్తాయి తోటలో సుమారు రూ.లక్ష విలువైన టేకు 15 చెట్లు, వేప చెట్లు 15, ఎర్రచందనం మొక్కలు 20 వీటిని కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రొక్లెయిన్‌తో తొలగించారని పేర్కొన్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదుచేయనున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

కనిగిరి రూరల్: పట్టణంలోని అర్బన్ కాలనీలో బీజేపీ నాయకులు ఆదివారం మొక్కలు నాటారు. ప్రధాని నరేంద్ర మోడీ మన్‌కీ బాత్ కార్యక్రమం అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు ముక్కు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. పరిసరాల పచ్చదనంతోనే మంచి ఆరోగ్యం లభిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహులు, మోడి వెంకటేశ్వర్లు, వెంకట రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

టంగుటూరు: తల్లితండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపి వారిలో విజ్ఞానం పెంపొందించేందుకు దోహదపడాలని లైబ్రేరియన్ వర్ధనరాజు కోరారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కథలు, ఆటల పుస్తకాలు చదివించారు.

వైభవంగా నారాయణస్వామి

ఆరాధన మహోత్సవం



నారాయణస్వామివారి మూల విగ్రహమూర్తి



పూర్ణాహుతితో ఆలయ ప్రదక్షిణలు చేస్తున్న కమిటీ, ఈఓ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆరాధన మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా రుత్వికులు మంకాల శివప్రసాద్, పప్పు శ్రీకాంత్, జొన్నాబొట్ల తేజ, సత్యనారాయణలు నారాయణస్వామి మూల విగ్రహమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పుణ్యాహవచనం, కలశస్థాపన, మహానారాయణహోమం, నవగ్రహ హోమాలు, పంచహారతులు నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, డాక్టర్ కవిత దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఆరాధన మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, బైసాని మధు, భక్తులు పాల్గొన్నారు.



పారిశుధ్యం అధ్వానంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

పారిశుధ్యం అధ్వానంపై ఆగ్రహం

కనిగిరి రూరల్: పట్టణంలో పారిశుధ్యం తీవ్ర అధ్వాన్నంగా ఉంది.. ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోరా.. అంటూ మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 15వ వార్డుతో పాటు పలు వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఏవార్డులో చూసిన ప్రజలు పారిశుధ్యంపై ఫిర్యాదు చేస్తున్నారు. కనీసం చెత్త సేకరణ జరగడం లేదని వాపోతున్నారు. వార్డుల్లో ఎన్ని రోజులకు కాలువల్లో పూడికలు తీసుకున్నారో.. అర్థం కావడంతో కాలువల్లో మురుగునీరు నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాయ సిబ్బంది పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ కార్యదర్శులు బాధ్యతాయుతంగా, సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్యంపై ఎవరు నిర్లక్ష్యం వహించిన శాఖ పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి, నిర్ణయించి వార్డుల్లో పారిశుధ్య చర్యలు అమలు చేసేవిధంగా వ్యవహరించాలన్నారు.

రేపటి పౌరులు.. పొగాకు బానిసలు!

కొండపి(సింగరాయకొండ): పాఠ్య పుస్తకాలు ఉండాల్సిన చేతుల్లో పొగాకు ఉత్పత్తులు దర్శనమిస్తున్నాయి. తెలిసీతెలియని వయసులోనే గుట్కా, ఖైనీ, సిగరెట్లకు కొందరు విద్యార్థులు ఆకర్షితులవుతున్నారు. కొండపిలోని ఓ హైస్కూల్ విద్యార్థులు తమ తల్లిదండ్రులు తినుబండారాలు కొనేందుకు ఇచ్చిన నగదుతో సిగిరెట్, గుట్కా ప్యాకెట్లు కొనుగోలు చేస్తున్నారు. వాటిని ప్రభుత్వ పాఠశాల వెనుక నిర్మాణంలో ఆగి పోయి ఉన్న మినీ స్టేడియంలో సేవిస్తున్నారు. మండల కేంద్రంలోని పలు దుకాణాదారులు నిబంధనలు మరిచి చిన్నారులకు సైతం పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, పోలీసులు స్పందించి రేపటి పౌరులు పొగాకు ఉత్పత్తులకు బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. చిన్నారులు పొగాకు ఉత్పత్తులు సేవిస్తుండటంపై ఎస్సై కృష్ణబాజిబాబును వివరణ కోరగా.. దుకాణాలను పరిశీలించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మినీ స్టేడియం భవనంలో గుట్కా ప్యాకెట్లు



ఫొటో తీస్తుండగా పారిపోతున్న బాలురు

నష్టపరిహారం అందజేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి రూరల్: నడికుడి కాళహస్తి రైల్వేలైన్, గ్రీన్ ఫీల్డ్ హైవే బైపాస్ రోడ్డు నిర్మాణాల్లో భూములు కోల్పోతున్న రైతులతో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆదివారం సమీక్షా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ ఆయా నిర్మాణాల్లో భూములు కోల్పోతున్న భూ బాధితులకు నష్ట పరిహారాన్ని తక్షణం అందచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంఘ కార్యవర్గం ఎన్నిక

హనుమంతునిపాడు: మండల విశ్వబ్రాహ్మణుల సంఘ అధ్యక్షునిగా వాగుమడుగు నారాయణచారి, ప్రధాన కార్యదర్శిగా సోడా శివబ్రాహ్మచారులను సంఘం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల విశ్వబ్రాహ్మణుల నూతన సంఘ సభ్యుల ఎన్నిక సమావేశం నిర్వహించారు. సమావేశం జిల్లా విశ్వబ్రాహ్మణుల సంఘ అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాచారి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించి వాగుమడుగు నారాయణాచారిని అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా సోడా శివబ్రహ్మచారిని ఎనుకున్నారు. కోశాధికారిగా పాలురి శ్రీనివాచాచారిని, సంఘ సభ్యులును ఎన్నుకున్నారు. రాష్ట్రనాయకులు ప్రకాశరావు సంఘనాయకులు సుధాకర్, మాల్యాద్రి, ప్రకాశరావు, బ్రహ్మనందం పాల్గొన్నారు.



విశ్వబ్రాహ్మణుల నూతన సంఘ సభ్యులు

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోట సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోట సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర



పోలేరమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న గ్రామస్తులు

దొనకొండ: మండలంలోని చందవరం పంచాయతీ పరిధి దేశిరెడ్డిపల్లెలో గ్రామస్తులు కుల మతాలకు అతీతంగా ఆదివారం పోలేరమ్మ జాతర ఘనంగా జరుపుకున్నారు. వర్షాలు పడాలి, పంటలు పండాలని గ్రామ దేవత పోలేరమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. ఆడ పడుచులు పోలేరమ్మ దేవతకు పొంగళ్ళు చేసి నైవేద్యం సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పోలేరమ్మ జాతరలో పాల్గొన్నారు. గ్రామస్తులు జాతరకు విచ్చేసిన వారికి భోజనాలు ఏర్పాటు చేశారు.

విద్యార్థులు ఇష్టంగా చదవాలి



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఉలవపాడు: విద్యార్థులు ఇష్టంగా చదవాలని ఉలవపాడు గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు అన్నారు. ఉలవపాడులోని శాఖా గ్రంథాలయంతో పాటు మండల పరిధిలోని చాకిచర్ల గ్రామంలోని బీడీసీఎల్‌లో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలను చదవాలన్నారు. ఉలవపాడు గ్రంథాలయానికి అనుబంధంగా ఉన్న ఈ శాఖలోని పుస్తకాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో నీతికథలు చదవించి క్యారమ్స్ ఆడించారు.

కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం



మాట్లాడుతున్న కె.వీరారె

కనిగిరి రూరల్: గ్రామీణ పేదలను, రైతులను కేంద్ర ప్రభుత్వం వచించిందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి అన్నారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కనిగిరిలో కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా కె.వీరారెడ్డి మాట్లాడుతూ బడ్జెట్‌లో రైతన్నల సమస్యలను, శ్రేయస్సును విస్మరించారని ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టే విధంగా ఉందని తీవ్రంగా మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించారన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తుల పరం చేస్తోందని తీవ్రంగా ఆరోపించారు. అందులో భాగంగానే నల్ల వ్యవసాయ చట్టాలను దొడ్డి దారిన అమలు చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో ఉత్పత్తి రంగాల కన్నా.. స్పెక్యులేటివ్ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఎరువుల సబ్సిడీలో 35 శాతం, ఆహార సబ్సిడీలో శాతం ఉపాధి హామీ చట్టం నిధుల్లో 20 శాతం కోత పెట్టిందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రివైజ్ చేసి రూ.5వేల కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, ఆచారి, వెంకటరెడ్డి, అంజమ్మ, రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పోలేరమ్మ తల్లి పొంగళ్లు



పూజలందుకుంటున్న యల్లమ్మతల్లి

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు గ్రామంలో శనివారం రాత్రి, ఆదివారం గ్రామ దేవత పోలేరమ్మతల్లికి గ్రామస్తులు ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. కుంకుమ బండ్లు, బోనాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. సకాలంలో వర్షాలు పడి గ్రామం పాడిపంటలతో కళకళలాడాలని అమ్మవారికి పూజలు చేశారు. అలాగే గ్రామ దేవత యల్లమ్మతల్లికి పొంగళ్లు పెట్టి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంతోర్మ అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



బోనాలతో భక్తులు

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: ప్రసిద్ధిగాంచిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి పోలేరమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

శాకంబరీదేవిగా వల్లూరమ్మ తల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో క్రోధి నామ సంవత్సర ఆషాఢ మాస సందర్భంగా ఆదివారం వల్లూరమ్మ తల్లి శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణమంతా కూరగాయలతో అలంకరించారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఈఓ రమేష్ పర్యవేక్షించారు.



శాకంబరీదేవి అలకారంలో వల్లూరమ్మ తల్లి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



అవగాహన కల్పిస్తున్న న్యాయ సేవా సంస్థ సహాయకులు, హెడ్‌కానిస్టేబుల్

కొండపి(సింగరాయకొండ): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని న్యాయ సేవా సంస్థ సహాయకులు బి.రమేష్‌బాబు, సదాశివ శాస్త్రి తెలిపారు. కొండపిలోని స్థానిక గురుకుల పాఠశాల వద్ద హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే జరిమానా తప్పదని హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, హోంగార్డు శేఖర్ హెచ్చరించారు.